

# డాక్టర్‌గారి భార్య

## – కొమ్మూరి వేణుగోపాలరావు



(గత సంచిక తరువాయి)

**రెండు మూడు రోజులు** మామూలుగా జ్వరంగా వస్తుంది, ఉన్నట్లుండి కాలు చచ్చుపడిపోయి పోలియోకి దించుతుంది.

మూడు నాలుగు రోజులు జ్వరమొస్తుంది తర్వాత ఏ చికెన్ ఫాక్స్‌లోకో, మీజిల్స్‌లోకో దింపుతుంది. చికెన్‌ఫాక్స్‌ని ఆట్లమ్మ అనీ, ముత్యాలమ్మ అనీ – మీజిల్స్‌ని వేపపూత అనీ అంటారు. వాటిలోకి దించగానే పేషెంట్స్ డాక్టరు దగ్గరకు రావటం మానేస్తారు. అవి వైరల్ ఫీవర్స్ – అన్ని వైరల్ ఫీవర్స్‌లాగానే ట్రీట్‌మెంట్ పనిచేసినా చెయ్యకపోయినా అబ్జర్వేషన్‌లో పెట్టి కన్సర్వేటివ్ లైన్స్‌లో ట్రీట్‌మెంట్ ఇస్తూ, కాంప్లికేషన్ రాకుండా చూసుకోవాలని ఎంత చెప్పినా వినిపించుకోకుండా మందు వాడటం, మానేస్తారు. తగ్గినవాళ్ళు సరేసరి, లేనివాళ్ళు కొన్నాళ్ళకు లంగ్ కాంప్లికేషన్స్‌తోనో, బ్రెయిన్ కాంప్లికేషన్స్‌తోనో పరిగెత్తుకు వస్తారు.

డీహైడ్రేషన్ కేసులు సరేసరి. మండు వేసవిలో, లేకపోతే వర్షాకాలంలో మరీ ఎక్కువ. డాక్టరుకి ఓ పరీక్ష.

సురేష్ మొదట క్లోజ్‌డ్ మెథడ్‌లో ప్రయత్నిస్తాడు. కొంతమందికి పిల్లలు కదలకుండా పడుకుంటే ఆ ట్రీట్‌మెంట్ సరిపోతుంది. స్కార్పొవెయిన్ నీడిల్స్ వచ్చి చాలావరకూ మేలు చేశాయి. కాని ఆ మెథడ్‌వల్ల ఒకటి రెండు బాటిల్స్ ఎక్కడందాకా పిల్లల్ని ఆపవచ్చు. తర్వాత చాలా కష్టం. ఆ డీహైడ్రేషన్ ఎక్కువగా ఉన్నప్పుడు ఓపెన్ మెథడ్ తప్పనిసరి అవుతోంది. అందులో కూడా ఎన్నో కాంప్లికేషన్లు. ఒక్కోసారి ట్యూబ్‌లో వున్న నీడిల్ మొన ట్యూబ్‌కి గ్రుచ్చుకుని లీక్ అయిపోతూ ఉంటుంది. మళ్ళీ ట్యూబ్ కత్తిరించి నీడిల్ మార్చాలి.

అలా ఒకటి రెండుసార్లు చేస్తే ట్యూబ్ పొడవు సరిపోదు. చేతికి కట్టేసి ఉన్నంతసేపూ పిల్లో, పిల్లవాడో విపరీతంగా, భరించలేనంత విపరీతంగా ఏడుస్తూ ఉంటారు. ఆ బాధ భరించలేక తలితండ్రులు కళ్ళనీళ్ళు పెట్టుకుని డాక్టర్‌ని సతాయిస్తూ ఉంటారు. ఎంత సెడేషన్ ఇచ్చినా నిద్రపోరు. నరేష్ చాలా రెస్ట్‌లెస్‌గా ఫీలవుతూ ఉండేవాడు. డీహైడ్రేషన్ తగ్గాక, ఫ్లూయిడ్స్ ఎక్కువయితే ఒళ్ళంతా పొంగి ఓవర్ హైడ్రేషన్ వస్తుంది. అందుకని పాలిథిన్ ట్యూబ్ వెయిన్‌లోనే ఉంచి ఇవతలి కొన అగ్గిపుల్లతో కాల్చి సీల్ చేసి ప్లాస్టిక్ వేసేవాడు.

అలా ఒకటి రెండు రోజులున్నాక అవసరమొచ్చి మళ్ళీ సెలైన్ కనెక్ట్ చెయ్యబోతే ట్యూబ్ గట్టితనం కోల్పోయో, పొజిషన్ తప్పో సెలైన్ ఫ్లో అయేదికాదు. ఒక్కోసారి పూర్తిగా తగ్గిపోయిందని డిస్కనెక్ట్ చేసేశాక – మళ్ళీ డయేరియా మొదలయేది. మళ్ళీ ఇంకోచోట వెన్‌సెక్షన్ చేసి మళ్ళీ డ్రిప్ స్టార్ట్ చెయ్యటం. కొన్ని వందల ఆపరేషన్లు చేసిన డాక్టరు కూడా ప్రతి క్రొత్తకేసుకూ టెన్షన్ ఫీలవుతూ ఉంటాడు. అలాగే నరేష్ కూడా డీ హైడ్రేషన్ కేసు ఎన్నిసార్లు ట్రీట్ చేసినా కొత్తకేసు వస్తే ఎప్పటికప్పుడు మానసికమైన వత్తిడికి లోనయేవాడు. ఆ కేసు డిశ్చార్జి అయేదాకా అనుక్షణం ఉలికిపడుతూ ఉండి, ఇంటికొచ్చిన కాసేపు కూడా నిద్రపట్టేది కాదు.

"అది కూడదు" అనేది సహజ.

"ఏది?"

"డాక్టరు పేషెంటుకు ప్రాణం పొయ్యటానికి తన శక్తినంతా ధారపొయ్యాలి – కాని తాను మాత్రం టెన్షన్‌కు లోనై ప్రశాంతను పోగొట్టుకోకూడదు."

"చేతకావటంలేదు."

"సాధన చెయ్యాలి. లేకపోతే ఈ టెన్షన్‌వల్ల మిగతా కేసులు పాడుచేసే అవకాశముంది."

అంతేకాదు సీరియస్ కేసులు ట్రీట్ చేసేటప్పుడు రొటీన్ కేసులు, మామూలు కేసులకున్నవి అలక్ష్యం చెయ్యటం సహజం. కాని ప్రతిపేషెంటూ తన సమస్య పెద్దదైనా, చిన్నదైనా తన కేసు ముఖ్యమైనదే అనుకుంటాడు. అలాంటప్పుడు డాక్టరు తనని సరిగా చూడలేదని అసంతృప్తి చెందుతూ ఉంటాడు కూడా. ఎంత నిగ్రహంతో ఉందామన్నా సీరియస్ కేసులు చేసేటప్పుడూ అతని దృష్టి మిగతా కేసులమీద అట్టే ఉండేది కాదు. అది బలహీనత అని అతనికి తెలుసు. కాని బలహీనతను జయించటం అంత తేలిక కాదుగదా. ఒకసారి ఓ ఇరవయ్యేళ్ళమ్మాయి వచ్చింది. ఆస్తి, అంతస్థులో చాలా తక్కువ దశకు చెందినట్లు కనబడుతున్నా మనిషిలో హుందాతనం, ముఖంలో ఓ వర్చస్సు, ఆకర్షణ ఉన్నాయి. తన ఆరునెల్ల పాపను తీసుకొచ్చింది. ఉన్నంతలో ఎప్పుడూ డబ్బు కరెక్టుగా ఇచ్చేది. ఆ స్త్రీ పేరు అంజన. ఆ పాపకు ఎప్పుడూ ఏదో ఒక సుస్తీ చేస్తూ ఉండేది.

తర్వాత తర్వాత ఆమె ముఖంలో పూర్వపు చలాకీతనం, ఉత్సాహం తగ్గిపోసాగింది. ఎప్పుడూ దిగులుగా కనిపించేది. ఒక్కోసారి డబ్బుకూడా ఇవ్వలేని అసక్తత ఆమెలో కానవచ్చేది.

ఒకసారి ఉండబట్టలేక "అలా ఉన్నారేం?" అని అడిగాడు నరేష్

ఆమె చెప్పటానికి సంకోచిస్తోంది.

"ఫర్వాలేదు చెప్పండి"

మెల్లగా బుజ్జగించగా చెప్పింది. ఆమె భర్త, ఆమె ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఇద్దరి మధ్యా ఎలాంటి కలతలు లేవు. అటువంటిది ఉన్నట్లుండి హఠాత్తుగా ఆమె భర్త మాయమైపోయాడు. ఏమైనాడో తెలీదు. ఏదయినా పనివుండి

పొరుగూరు వెళ్ళాడేమోనని కొన్ని రోజులు సరిపెట్టుకుంది. అప్పటికీ రాకపోతే అతను పనిచేస్తున్న ఆఫీసుకు వెళ్ళి వాకబు చేసింది. ఏమయినాడో తెలీదని వాళ్ళుకూడా ఆశ్చర్యం ప్రకటించారు.

పుట్టింటివారెవరూ లేరు. అత్తవారివైపు అత్త ఒకతే ఉంది. ఆవిడ చాలా మంచి మనిషి. ఒక్కడే కొడుకు. ఉన్న ఒక్క కొడుకూ పరారయేసరికి మానసికంగా కృంగిపోయింది. వాళ్ళకి ఆర్థికంగా ఏ ఆధారమూ లేదు. ఇప్పుడు కుటుంబాన్ని పోషించవలసిన బాధ్యత అంజన మీద పడింది. ఉద్యోగం కోసం వెదుకుతోంది.

"ఉద్యోగం దొరికిందా?" అనడిగాడు.

"ఇంకాలేదు. ఈ మధ్యనేకదా చూస్తున్నాను"

అతనికి తన దగ్గరే ఉద్యోగమిచ్చి సాయపడాలని జాలికలిగింది. కాని ఇప్పుడప్పుడే అంత స్థోమత లేదు.

పేషెంట్స్ బాగానే వస్తున్నారు నిజమే కాని వచ్చిన ప్రతివాడూ డబ్బు ఇవ్వరు. కొందరు శక్తిలేక యివ్వరు. కొందరు బుద్ధిపుట్టక ఇవ్వరు. కొందరితో ఆబ్లికేషన్లు వుంటాయి. కొందరితో ఏ ఆబ్లికేషనూ లేకపోయినా వున్నట్లనుకుని యిస్తూ వుండరు. ఏ గవర్నమెంటు ఆఫీసరు దగ్గరో, లేక గవర్నమెంట్ స్టాఫ్ దగ్గరో కర్మకాలి ఏ పంచదార కార్డో, పాలకార్డో లేక ఇంకేదన్నా, చిన్న ఉపకారమో పొందటం జరిగితే – మహా అద్భుతం చేసినట్లు ఫోజు పెట్టి ఉచితంగా ట్రీట్‌మెంట్ పొందటానికి హక్కువున్నట్లు ఫీలయి ఆ హక్కుని జన్మతా ఉపయోగించుకుంటూ వుంటారు.

పోలీస్ డిపార్ట్‌మెంట్ వాళ్ళో, యిన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ వాళ్ళో అయితే వాళ్ళకు జన్మతః ఫ్రీ ట్రీట్‌మెంట్ పొందటానికి హక్కున్నట్లు ప్రవర్తిస్తారు. కొతమంది సమాజంలో ఆర్థికంగా గానీ రాజకీయంగా గాని ఉచ్చస్థితిలో వున్నవారు జబర్దస్తీగా లోపలకు తోసుకు రావటమో, లేకపోతే నేనొచ్చానని చెప్పు. అని ఠీవిగా కబురు చెయ్యటమో చేస్తూ ఉంటారు. ఇది ప్రయివేటు ప్రాక్టిస్. లోలోపల ఎంత ఉద్రేకం వొచ్చినా వాళ్ళ ప్రవర్తనని భరించి బయటకు నవ్వుతూ ఉండాలి. ఒక్కోసారి బయట గంటల తరబడి వెయిట్ చేస్తున్న పేషెంటును పిలుద్దామనో, లేకపోతే సీరియస్‌గా వున్న కేసుని పిలుద్దామనో, మనసులో వుంటుంది. కాని యీ లోపలే ఎవరో జొరబడి, ఆ మూడ్‌ని ఛిన్నాభిన్నం చేస్తూ వుంటారు. అయినా భరించాలి తప్పదు. ఏ మాత్రం విసుగు ప్రదర్శించినా డాక్టరుగారికి కోపం అని ఓ మార్క్ వేసేస్తారు.

"ఏమయి వుంటాడతను?"

"తెలీదు."

"కావాలని వెళ్ళిపోయి వుంటాడా?"

"తెలీదు. కాని ఆశ్చర్యంగా వుంది – మా బావ ఇలా చేస్తాడంటే నమ్మశక్యంగా లేదు."

"పోనీ ఏదన్నా ప్రమాదంలో..."

"ఏమయిందీ ఊహించలేకపోతున్నాను. కాని బ్రతికే వున్నాడని ఎప్పటికైనా తిరిగొస్తాడనీ నమ్మకంగా వుంది."

ప్రపంచంలో అన్నిటికన్న – ఆ ఆశ గొప్పది.

ఆ తర్వాత పది పదిహేను రోజులకు పాపకు చాలా సీరియస్‌గా వున్న దశలో తీసుకొచ్చింది. డయేరియావల్ల డీ హైడ్రేషన్ వచ్చింది.

"డాక్టర్! ప్రపంచంలో ఈ ఒక్క ఆధారం కోసమే బ్రతుకుతున్నాను. యిది నాకు లేకుండా నేను బ్రతకలేను."

"తప్పకుండా ప్రయత్నిస్తానమ్మా!" అన్నాడు నరేష్ చాలా జాలిగా.

"కాని డాక్టర్ నా దగ్గర పైసాలేదు."

"ఫర్వాలేదు"

"కనీసం మెడిసిన్స్ రాసిచ్చినా తెచ్చుకోలేను."

"ఫర్వాలేదన్నానుగా!"

రెండురోజులు చావు బ్రతుకుల మధ్య పెనుగులాడాక పాప ఒడ్డున పడింది.

ఈ రెండు మూడు రోజులూ ఆమె ఏమయినా తిందోలేదో కూడా తెలీదు. ఆమె అత్త ఒకటి రెండుసార్లు వచ్చి వెళ్ళిందిగాని, ఆమె కూడా రోగిష్టి మనిషిలా వుంది.

"డాక్టర్! థాంక్సండీ మా పాపని బ్రతికించారు" అన్నది అంజన చాలా కృతజ్ఞతతో.

"అవును" అంది సహజ.

"అప్పుడే వద్దనుకున్నాంగా."

"మీరు స్ట్రిక్ట్‌గా అబ్జర్వ్ చెయ్యలేదుగా."

"డాక్టరు అందరికీ చెబుతాడు గాని తాను చెయ్యనక్కర్లేదు."

"పోనీ ఇదీ మంచిదేలే."

"ఏది?"

"గబగబ యిద్దర్ని కనేసి ఠక్కున ఆపేద్దాం."

"ఏమిటి ఆపేద్దాం?"

"అదే.. పిల్లల్ని కనటం."

సహజకు హైపరెమిసిస్ గ్రావిడేరం వచ్చింది. ఒకటే వామిటింగ్స్. ఏమి తిన్నా యిమడటంలేదు. మనిషి బాగా శుష్కించిపోయింది. అయినా చేసేదిలేక లేని ఓపిక తెచ్చుకుని లేచి అలాగే పనులు చేసుకుంటోంది.

అతనికి చాలా బాధ కలిగింది "సహజా!" అన్నాడు జాలిగా.

"ఎవరూ లేకపోవటం వల్ల ఎంత ఇబ్బందో చూశావా?"

"ఆమాత్రం ఇబ్బంది లేకుండా జీవితమెలా వుంటుంది?"

"పోనీ నేను హాస్పటల్ మానేస్తాను"

"మానేసి?"

"నీకు సేవలు చేస్తాను."

"సహజ నవ్వింది "నాకు సేవలు చెయ్యటం కోసం కాదు మీరు - ప్రజల కోసం"

"ఎంతకాలం?"

"ఎంతకాలమైనా సరే. డాక్టరు వృత్తికి రిటైర్మెంట్ అంటూ లేదు. నేను చెప్పేది ఉద్యోగానికి కాదు. వృత్తికి."

ఆమెకు ఒక కోరిక. తీవ్రమైన కోరిక. ఎంత సమర్ధంగా ట్రీట్‌మెంట్ చేసినా ప్రజల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ అంటే ఓ గ్లామర్ వుంది అందరూ కాదా కొంతమంది రెండు మూడు రోజులు చూసి "ఏమండీ ఎవరయినా పెద్ద డాక్టరుకు చూపిద్దామా?" అంటూంటారు. అలాంటప్పుడు అతను చిన్నబుచ్చుకోవటం ఆమెకు చాలా బాధ కలిగించేది. ఎప్పటికైనా ఎలాగైనా సరే అతన్ని పోస్ట్ గ్రాడ్యుయేట్‌ని చెయ్యాలి. తర్వాత పెద్ద నర్సింగ్ హోం, అన్ని వసతులూ, వనరులూ వున్న నర్సింగ్‌హోం - అతను మెళ్ళో స్టెతస్కోప్ వేసుకుని వార్డులో రౌండ్స్ చేస్తూండగా, ప్రక్కన నర్సులు ఆదరాబాదరాగా పరుగులు తీస్తూండగా చూడాలని, చూసి తరించాలని చాలా చాలా కోరిక.

ఆ కోరిక తీరుతుందా?

కేవలం డిగ్రీయే కాదు. ప్రజల్లో అతడ్ని మానవత్వం మూర్తీభవించిన వ్యక్తిగా, వొంక పెట్టటానికి వీల్లేని డాక్టరుగా, సంఘంలో గౌరవనీయమైన స్థానం అలంకరించే ప్రముఖునిగా తీర్చిదిద్దాలి, అప్పుడే తన జీవితానికి సార్ధకత.

కొందరికి కొందరిమీద ఎందుకు యింప్రెషన్ ఏర్పడుతుందో చెప్పటం కష్టం.

ఒకరోజు నరేష్ దగ్గరకు ఒకాయన వచ్చారు. నలభయి ఏడూ, నలభయి ఎనిమిదేళ్ళదాకా వుంటాయి. పంచా లాల్చీ వేసుకుని చాలా భారీగా హుందాగా కనబడుతున్నాడు. కారులో దిగాడు. బహుశా పెద్ద బిజినెస్ మేగ్నెట్ అయివుండవచ్చు.

ఏమీ తొందర చెయ్యకుండా బయట పేషెంట్స్ మధ్యలో కూర్చున్నాడు. ఏదో పనిమీద బయటికి వచ్చిన నరేష్ ఎందుకో ఆయన రూపం ఆకర్షించింది. కొంచెం పరీక్షగా చూస్తే ఎంతో జ్వరంతో బాధపడుతూ నిగ్రహించుకుంటున్నాడని తెలుస్తుంది. అప్రయత్నంగా దగ్గరకు వెళ్ళి చూశాడు. ఒళ్ళు కాలిపోతోంది. వెంటనే లోపలకు తీసుకెళ్ళి పరీక్ష చేశాడు. జ్వరం నూట అయిదు డిగ్రీలుంది. వైరల్ ఫీవరై వుండవచ్చు, లేకపోతే మలేరియా అయివుండవచ్చు. అంత జ్వరమంలో కుదురుగా కూర్చుని వున్నాడంటే అతను చాలా విల్ పవర్ వున్నవాడయి వుండాలి.

"డాక్టరుగారూ! ఈ జ్వరం అర్జంటుగా తగ్గిపోవాలి" అన్నాడాయన.

"ఇంత జ్వరం అర్జంటుగానా?"

"అవును. రేపు మళ్ళీ వచ్చినా ఫర్వాలేదు. కొన్న లక్షలతో కూడిన బిజినెస్ ట్రాన్సాక్షన్ ఈవేళ వుంది. అది ఎంత ఇంపార్టెంటో మీరు బిజినెస్ మ్యాన్ కాదు కాబట్టి మీకు తెలీదు. కాని తగ్గితీరాలి."

ఆయనెవరో తనకు తెలియదు. ఊళ్ళో ఇంతమంది డాక్టర్లుండగా తనకే యీ విషమ పరీక్ష పెడుతున్నారేమిటి అనుకున్నాడు.

"ఒకవేళ తాత్కాలికంగా తగ్గినా చాలా నీరసంగా వుంటుంది తట్టుకోలేరు" అన్నాడు తప్పించుకుందామని.

"నీరసాన్ని సునాయనంగా జయించగలను. నాకు జ్వరం తగ్గించెయ్యండి" అన్నాడు.

నరేష్‌కు ఏం చెయ్యాలో తోచలేదు. మళ్ళీ ఇంకోసారి పరీక్ష చేశాడు ఇహ తప్పేదేమిటని రెండు పేరాసిటమాల్ టాబ్లెట్స్, మూడు కామోక్విన్, వాంతి రాకుండా ఒక పెరినాం, ఒకేసారి నాలుగు బిటామెథజోన్ టాబ్లెట్స్, ఒక యాంపిసిలిన్ ఫైవ్ హండ్రడ్ యింజక్షన్ చేసేశాడు. మనసులో ఏమూలో తప్పు అనిపిస్తోంది. కాని కొన్ని పరిస్థితుల్లో అలాంటి తప్పు చెయ్యటం అన్ ఎథికల్ కాదనిపిస్తుంది. మొత్తం మీద ఓ పావుగంటలో అతని జ్వరం మిరాకిల్‌లా తగ్గిపోయింది. ఇంచుమించు నార్మల్‌కి టచ్ అయింది. ఇంకా తగ్గిపోయి ఏ తొంభై అయిదుకో దిగిపోతుందని ఇంకో పావుగంటసేపు కూర్చోపెట్టాడు. అదే ఇంకోమనిషయితే నిస్త్రాణతో పడిపోయేవాడు కాని ఆయన్లో ఆ చిహ్నాలేమీ కనబడటంలేదు. కృతజ్ఞతలు చెప్పి సంతోషంగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

వెళ్ళేముందు, "మీపేరు?" అడిగాడు నరేష్.

"జయచంద్ర."

మరునాడు ఉదయం సీటులో కూర్చుని వరుసగా ఓ.పి చూసుకుంటున్నాడు.

ఓ గంట తర్వాత ఆ భారి విగ్రహం లోపలికి వచ్చింది.

ఆశ్చర్యంతో "ఎంతసేపయింది వచ్చి?" అనడిగాడు.

"ఎంతసేపయితే ఏంటిలెండి? తెలిగ్గానే వుందిగా. వెయిట్ చేస్తున్నాను."

"కబురు చెయ్యకపోయారా?"

"ఎందుకు కబురు చెయ్యటం? యమర్జన్సీ వుంటేగా. పాపం అంతమంది పిల్లలతో, సీరీయ్స్ కేసులతో సతమతమవుతూ వెయిట్ చేస్తోంటే నా ఢిఫరెన్స్ ఏమిటి?"

ఆయన సభ్యతకు, సంస్కారానికి ఆశ్చర్యపోయాడు. తర్వాత పరీక్ష చేసి చూస్తే జ్వరమూలేదు, ఏమీ లేదు. నిన్న చేశాడు కాబట్టి కోర్స్ కంటిన్యూ చెయ్యటం కోసం ఇవేళ కూడా యాంపిసిలిన్ చేశాడు.

ఆయన థాంక్స్ చెప్పి వెడుతూ టేబుల్ మీద ఓ కవరు పెట్టి వెళ్ళిపోయాడు.

తర్వాత చూసుకుంటే కవర్లో వెయ్యినూట పదహార్లున్నాయి. అతనికెందుకో సిగ్గువేసినట్లయింది తాను చేసిన సర్వీస్ ఎంత? అతని కనులు చమర్చినట్లయినాయి.

అతనికి గుర్తున్నంతవరకూ అంతకు ముందూ, ఆ తర్వాతా కూడా ఎవరూ అంత పెద్ద బిల్లు పే చెయ్యలేదు.

సహజకు ఈ సంగతి చెప్పాక ఆమె అంది. "మీకు యిప్పుడు టెలిఫోన్ అవసరం. డబ్బు నిలవవుంటే అనవసరంగా ఖర్చయిపోతుందిగాని యీ డబ్బులో ఎంత అవసరమో అంత డిపాజిట్ చేసి ఫోన్‌కి అప్లై చెయ్యండి."

మైక్రోస్కోప్ – ఎక్స్‌రే లాబ్ అంతకుముందే అమర్చుకున్నాడు.

అతను అలాగే ఫోన్ కోసం అప్లై చేశాడు.

డాక్టర్లకు ఫోన్స్ ఎలాట్ చెయ్యటంలో స్పెషల్ ప్రయారిటీ ఉంటుంది.

అతనికి రెండు మూడు నెలల్లోనే ఫోన్ వచ్చేసింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS